సాక్షి
గుంటూరు

శుక్రవారం । 20 । డిసెంబర్ । 2024



అయ్యప్ప స్వామికి పల్లకీ సేవ

బాపట్ల: భీమవారిపాలెంలోని కోదండరామ ఆలయంలో గురువారం అయ్యప్ప పల్లకీ సేవ ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ పల్లకీ మోశారు.



ఐలవరంలో నగర సంకీర్తన

ఐలవరం(భట్టిప్రోలు): ధనుర్మాసం పురస్కరించుకుని రోజూ నగర సంకీర్తన చేస్తున్నారు. విష్ణు సంకీర్తనతో సకల శుభాలుంటాయని అర్చకులు దీవి రఘునాథ చక్రవర్తి తెలిపారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 578.40 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 8,298 క్యూసెక్కులు విడుదలవుతోంది.

న్యూస్‌రీల్

10 మండలాల్లో వర్షం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలో బుధవారం ఉదయం నుంచి గురువారం ఉదయం వరకు 10 మండలాల్లో వర్షం పడింది. అత్యధికంగా గుంటూరు పశ్చిమలో 4.2 మి.మీ., అత్యల్పంగా పొన్నూరు మండలంలో 0.4 మి.మీ.గా నమోదైంది. మండలాలవారీగా చూస్తే కాకుమాను 3.4, ఫిరంగిపురం 2.8, పెదకాకాని 2.6, ప్రత్తిపాడు 2.2, వట్టిచెరుకూరు 2.2, పెదనందిపాడు 1.4, గుంటూరు తూర్పు 1.2, మేడికొండూరులో 1.2 మి.మీ. చొప్పున వర్షపాతం నమోదైంది.

తాడికొండ- కంతేరు రోడ్డుకు మరమ్మతులు



తాడికొండ: తాడికొండ- కంతేరు రోడ్డుకు ఎట్టకేలకు ఆర్అండ్‌బీ అధికారులు మరమ్మతులు నిర్వహిస్తున్నారు. 4 నెలల క్రితం వచ్చిన భారీ వరదలకు కొండవీటి వాగుకు వరద పోటెత్తి రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. మరమ్మతులు పేరుతో టీడీపీ నాయకులు రాళ్లు, ఫ్లైయాష్ డస్ట్ వేసి చేతులు దులుపుకొన్నారు. నాటి నుంచి నేటి వరకు పట్టించుకున్న నాథుడు కరువయ్యాడు. 'సాక్షి'లో కథనాలు ప్రచురితం కావడంతో ఎట్టకేలకు స్పందించిన అధికారులు మరమ్మతులకు శ్రీకారం చుట్టారు.

9 మందికి ఐదేళ్ల కారాగార శిక్ష

బాపట్ల: పొన్నూరులోని కోదండ రామాలయం నిధుల విషయంలో ఇరువర్గాల మధ్య జరిగిన వివాదంలో 9 మందికి ఐదేళ్ల చొప్పున కారాగార శిక్ష విధిస్తూ బాపట్ల ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి జి.వాణి గురువారం తీర్పు చెప్పారు. 2019లో దేవాలయం నిధుల విషయంలో 17 మందిపై పొన్నూరు అర్బన్ పోలీసులు కేసు నమోదు చేశారు. న్యాయస్థానంలో ఈ వ్యవహారంపై వాదోపవాదాలు జరగగా.. 9 మందికి శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలవరించారు.

రైతులకు యూనిక్ ఐడీ నంబరు



ఫిరంగిపురం: ప్రతి రైతుకు యూనిక్ ఐడీ నంబరును సిబ్బంది తప్పనిసరిగా ఇవ్వాలని వ్యవసాయశాఖ కమిషనర్ ఎస్. ఢిల్లీరావు అన్నారు. నుదురుపాడు సచివాలయం వద్ద గురువారం వ్యవసాయ శాఖ, కేంద్ర ప్రభుత్వం సమన్వయంతో రైతులకు ప్రత్యేక ఐడీ నంబరు ఇవ్వడంపై సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఢిల్లీరావు మాట్లాడారు. మండలంలోని నుదురుపాడు, మేరికపూడి, గుండాలపాడు, వేమవరం గ్రామాలను కేంద్ర ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసినట్లు చెప్పారు. దీని ద్వారా గ్రామాల్లోని రైతులందరికి గ్రామ వ్యవసాయ సహాయకులు , ఇతర సిబ్బంది యూనిక్ ఐడీ నంబరు ఇవ్వాలని సూచించారు. ప్రధాన మంత్రి కిసాన్ యోజన కింద రూ.6 వేల గ్రాంటు వీరికి ఇస్తారని తెలిపారు. వ్యవసాయ శాఖ అదనపు డైరెక్టర్ కె.విజయ లక్ష్మి, సంయుక్త సంచాలకుడు బాల సుబ్రహ్మణ్యం, జిల్లా వ్యవసాయాధికారి నున్న వెంకటేశ్వర్లు, సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకుడు టి. శ్రీనివాస రావు, ఏవో వాసంతి, సుబాని, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బంగారు తాపడం పనులకు రూ.2 లక్షలు విరాళం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ ఆలయ బంగారు తాపడం పనులకు గురువారం విజయవాడకు చెందిన భక్తులు రూ.2 లక్షలు విరాళాన్ని అందజేశారు. విజయవాడ కేదారేశ్వరపేటకు చెందిన యర్రం హరీష్ రూ.లక్ష, యర్రం తిరుమలరావు రూ.లక్ష విరాళాలను ఆలయ డీఈవో రత్నరాజుకు అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం దాతలకు ఆలయ అధికారులు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు.



- బుడమేరు వరద సహాయక చర్యలకు రూ.9.12 కోట్లు వ్యయం
- రూ.10 లక్షల ఖర్చు వరకే కమిషనర్‌కు అధికారం
- కౌన్సిల్ ఆమోదం లేకుండానే పప్పుబెల్లాల్లా పంపకం
- 'సంగం' డెయిరీకే ఏకంగా రూ. 3.05 కోట్లు చెల్లింపు
- నేటి కౌన్సిల్ సమావేశంలో సమస్యలపై చర్చకు కార్పొరేటర్లు సిద్ధం

చెల్లింపుల్లో అసలు సంగతేంటో?

సాక్షి ప్రతినిధి, గుంటూరు: గుంటూరు నగరపాలక సంస్థలో ఒక కమిషనర్‌కు సొంతంగా ఖర్చు చేయడానికి అధికారం ఉంది కేవలం రూ. 10 లక్షల వరకే. స్టాండింగ్ కమిటీ అనుమతితో రూ. 50 లక్షల వరకు ఖర్చు చేయవచ్చు. అంతకు మించి రూపాయి ఖర్చు చేయాలన్నా కౌన్సిల్ ఆమోదం ఉండాల్సిందే. కానీ ఇటీవల విజయవాడలో వచ్చిన బుడమేరు వరద సహాయ కోసం గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ నుంచి ఏకంగా రూ.9.12 కోట్లకుపైగా ఖర్చు పెట్టేశారు. దీనికి కనీసం కౌన్సిల్ అనుమతి లేదు. మేయర్, కార్పొరేటర్లతోపాటు నగర పరిధిలో ఉన్న ప్రజాప్రతినిధులకు కనీస సమాచారం కూడా ఇవ్వలేదు. మున్సిపల్ మంత్రి, సీడీఎంఏ, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అత్యవసరం కింద బిస్కెట్లు, పాలు, భోజనం, బ్రెడ్ ప్యాకెట్లు విజయవాడ నగరపాలక సంస్థకు అందించారు. ఈ డబ్బులు చెల్లించాలంటూ జిల్లా కలెక్టర్‌కు లేఖ రాశారు. ఆయన.. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్‌కు మరో లేఖ పంపారు. అంతకుమించి ముందుకు వెళ్లలేదు. గుంటూరు ప్రజల పన్నుల నుంచి వచ్చిన సొమ్మును ఇలా ధారాదత్తం చేసేశారు.

బుడమేరు వరదల కోసం రూ.కోట్లు ప్రభుత్వానికి దాతలు విరాళాల రూపంలో ఇచ్చారు. కేంద్రం నుంచి కూడా నిధులు వచ్చాయి. అయితే ఒక్కపైసా కూడా నగరపాలక సంస్థకు రానేలేదు. ఇప్పటికే మున్సిపల్ కమిషనర్ రూ.9.12 కోట్లను వివిధ వ్యక్తులకు, సంస్థలకు, అధికారుల సీ బిల్లుల రూపంలో చెల్లించేశారు. పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర చైర్మన్‌గా ఉన్న సంగం డెయిరీకి ఏకంగా రూ.3.05 కోట్లు చెల్లించారు. ఒక ఈఈ పేరుతో రూ.కోటి, మరొక ఈఈ పేరుతో రూ.50 లక్షలు చెల్లింపులు జరిగాయి. వీటికి సంబంధించిన బిల్లులు ఇంతవరకూ కార్పొరేషన్‌కు జమ చేయలేదు. దీంతో ఈ అంశాన్ని కౌన్సిల్ సమావేశంలో లేవనెత్తేందుకు కార్పొరేటర్లు సన్నద్ధం అవుతున్నారు.

కార్పొరేషన్ తీరును కడిగి పారేయాల్సిందే..!

గుంటూరు నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ విభాగంలో అవినీతిపై కౌన్సిల్ సమావేశంలో నిలదీసేందుకు వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు సన్నద్ధం అవుతున్నారు. అవినీతి కేసుల్లో ఉన్న వారికి పోస్టింగ్‌లు ఇవ్వడం, నగరంలో పెరిగిపోతున్న అక్రమ లేఅవుట్లు, నిర్మాణాలపై ఇప్పటికే పలువురు కార్పొరేటర్లు ప్రశ్నలు సంధించారు. ఈ నేపథ్యంలో సాధారణ కౌన్సిల్ సమావేశం శుక్రవారం నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు అధ్యక్షతన జరగనుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత జరగనున్న రెండో కౌన్సిల్ సమావేశం ఇది. మొత్తం 361 అంశాలలో సభ్యుల ప్రశ్నలు 99 కాగా.. మిగిలిన వాటిలో ప్రతిపాదనలు, కార్పొరేషన్ ప్రియాంబుల్స్ ఉన్నాయి.

అడ్డగోలుగా అధికారుల తీరు

కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత గుంటూరు నగరపాలక సంస్థలో అవినీతి పెచ్చుమీరిపోయిందనే ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా పట్టణ ప్రణాళిక విభాగంపైనే ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తోంది. మరోవైపు అవినీతి కేసుల్లో చిక్కుకున్న అధికారులకు ప్రధాన పోస్టులు కట్టబెట్టడం, పదుల సంఖ్యలో వార్డుల విధులు కేటాయించడంపై కార్పొరేటర్లు ఆగ్రహంగా ఉన్నారు. అక్రమ లేఅవుట్స్, అనధికార కట్టడాలపై నిలదీయనున్నారు.

ప్రొటోకాల్ పాటింపుపైనా...

అధికారులు కూటమి నేతల మెప్పు కోసం ప్రభుత్వ కార్యక్రమాలకు వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లను అధికారులు పిలవడం లేదు. టీడీపీ నాయకులకు ప్రాధాన్యం కల్పిస్తున్నారు. మేయర్‌ను కూడా శంకుస్థాపన కార్యక్రమానికి పిలవలేదు. శిలాఫలకంలో ఆయన పేరును చివరిలో వేసి చేతులు దులుపుకొన్నారు. ఈ విషయాలపైనా సమావేశంలో తమ అభ్యంతరాలను లేవనెత్తాలని వైఎస్సార్ సీపీ భావిస్తోంది.

నా మార్గం కమ్యూనిజం



కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణను సన్మానిస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ తదితరులు

కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ

సాక్షి అమరావతి: తన మార్గం కమ్యూనిజమని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. విశాలాంధ్ర ప్రచురించిన 'దీపిక' రచన ద్వారా కేంద్ర అవార్డును అందుకోవడం గర్వకారణమన్నారు. విజయవాడ విశాలాంధ్ర విజ్ఞాన సమితి ఆధ్వర్యంలో గురువారం చంద్రం బిల్డింగ్స్‌లో లక్ష్మీనారాయణకు సన్మానం చేశారు. 1974 నుంచి అరసంలో ఉన్న తనకు విశాలాంధ్రతో అనుబంధం కొనసాగుతోందన్నారు. 150కిపైగా పుస్తకాలకు సంకలనకర్తగాను, గౌరవ సంపాదకులుగా వ్యవహరించానని అన్నారు. దేశంలో ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో మార్పులు రావాలని పేర్కొన్నారు. కమ్యూనిస్టు ఉద్యమం మరింత బలపడాలన్నారు. మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, విశాలాంధ్ర దినపత్రిక ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ కూన అజయ్‌బాబు, పి.హరినాథ్‌రెడ్డి, చావా రవి తదితరులు మాట్లాడుతూ.. లక్ష్మీనారాయణకు ఈ అవార్డు రావడం ఎంతో గర్వకారణమన్నారు. ఆయన్ను అభినందించారు.

పంటల బీమా లక్ష్యం సాధించాలి

జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

గుంటూరు వెస్ట్: జిల్లాలో రబీలో సాగు చేస్తున్న పంటకు వంద శాతం రైతులు కచ్చితంగా ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజనలో నమోదయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజతో కలిసి నిర్వహించిన అధికారుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. బీమాకు రైతులు నామమాత్రంగా 0.3 శాతం ప్రీమియం చెల్లించి నమోదయ్యేందుకు ఈ నెల చివరి వరకు అవకాశం కల్పించారన్నారు. జొన్న పంటకు ఎకరాకు రూ. 48, మొక్కజొన్నకు రూ. 114, పెసలుకు రూ.45, మినుముకు రూ. 50, శనగకు రూ. 70 చెల్లించి పంట బీమాలో రైతులు నమోదు చేసుకోవచ్చన్నారు. సమావేశంలో డీఆర్వో ఖాజావలి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నున్న వెంకటేశ్వర్లు, ఉద్యాన శాఖ అధికారి రవీంద్రబాబు, ఎల్డీఎం మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్



1999 బ్యాచ్ గుంటూరు వైద్య కళాశాల విద్యార్థుల గ్రూప్ ఫొటో

అపూర్వ పలకరింత.. ఆత్మీయ పులకింత

గుంటూరు మెడికల్: వారంతా గుంటూరు వైద్య కళాశాలలో 1999 బ్యాచ్ వైద్య విద్యార్థులు... గురువారం సమావేశమైన వేళ ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుని సందడి చేశారు. ఒకరినొకరు పలకరించుకుని.. ఆత్మీయత చాటుకున్నారు. సుమారు ఏడాది పాటు ప్రణాళికా బద్ధంగా జరిగిన కృషి ఫలితంగా సిల్వర్ జూబ్లీ రీ యూనియన్ పేరుతో కలుసుకుని సంబరాలు చేసుకున్నారు. కళాశాల ఆవరణలోకి అడుగు పెట్టగానే నాలుగు పదులు దాటిన వారు కూడా యువతలా మారిపోయారు. కళాశాల జింఖానా ఆడిటోరియంలో గురువారం ఈ అపూర్వ కార్యక్రమానికి వేదికైంది. ఇప్పటికే ఈ బ్యాచ్ రూ. 80 లక్షలతో కొనుగోలు చేయించిన బస్సులను ప్రారంభించారు. మెన్స్, ఉమెన్స్ హాస్టల్‌లో క్రికెట్ ప్రాక్టీస్, షటిల్ కోర్టులను సుమారు రూ. 10 లక్షలతో ఏర్పాటు చేయించారు. పలు వైద్య విభాగాల్లో లెక్చరర్ గ్యాలరీలను ఆధునికీకరించి వైద్య పరికరాలను సైతం అందజేశారు. సుమారు రూ. 2 కోట్ల మేరకు విరాళాలు అందజేసి అందరి మన్ననలు పొందారు. జింఖానా సభ్యుడు డాక్టర్ పొదిల ప్రసాద్ ముఖ్య అతిథిగా విచ్చేసి వీరి సేవలను అభినందించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సుందరాచారి, వైస్ ప్రిన్సిపల్స్ ప్రభాకర్, శ్రీధర్ కూడా ప్రశంసించారు. కార్యక్రమంలో వైద్యులు భవనం హనుమ శ్రీనివాసరెడ్డి, భుక్యా సునీల్‌కుమార్ నాయక్, కందుల రామ్, గోపతి నాగేశ్వరరావు, పద్మజ, ప్రసన్న లక్ష్మి, అమరేశ్వరి, ఇందిర వరలక్ష్మి, అమిత, శ్రీలక్ష్మి, మాధవి తదితరులు పాల్గొన్నారు.

రికార్డు స్థాయిలో మిర్చి విక్రయాలు

- గుంటూరు మార్కెట్ యార్డుకు 62 వేలకుపైగా బస్తాలు
- సీజన్ ప్రారంభం కావడంతో 60 వేల బస్తాల విక్రయం



కొరిటెపాడు (గుంటూరు): మిర్చి యార్డులో సరకు గురువారం రికార్డు స్థాయిలో 60 వేల బస్తాలకు పైగా విక్రయించారు. దాదాపు 63 వేలకుపైగా బస్తాల మిర్చి మార్కెట్‌కు వచ్చింది. ఇటీవల కాలంలో ఇదే అత్యధికం కావడం విశేషం. సీజన్ ప్రారంభం కావడంతోపాటు దిగుబడులు పెరగడం కారణమని రైతులు చెప్పారు. గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 62,930 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 60,185 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి రూ. 15,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి 16,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 7,500 నుంచి రూ. 14,300 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 8,000 నుంచి రూ. 16,200 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,000 నుంచి రూ.10,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 51,277 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి వి.ఆంజనేయులు తెలిపారు.

మార్కెట్ ఫీజు వసూళ్లు పెరగాలి



మాట్లాడుతున్న మార్కెటింగ్ శాఖ ఆర్జేడీ శ్రీనివాసరావు

కొరిటెపాడు(గుంటూరు): ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను మార్కెట్ యార్డులు, చెక్‌పోస్టులకు నిర్దేశించిన ఫీజు వసూళ్ల లక్ష్యాలు వంద శాతం సాధించాలని సంబంధిత అధికారులను మార్కెటింగ్‌శాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్(ఆర్జేడీ) కాకుమాను శ్రీనివాసరావు ఆదేశించారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల మార్కెట్ కమిటీల కార్యదర్శులు, మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులతో చుట్టగుంటలోని ఏడీఎం కార్యాలయం ఆవరణలోని సమావేశ మందిరంలో గురువారం ఆయన సమీక్ష నిర్వహించారు. 28 మార్కెట్ యార్డులు, 75 చెక్‌పోస్టుల పనితీరు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్జేడీ మాట్లాడుతూ వచ్చే మార్చి చివరి నాటికి అన్ని మార్కెట్ కమిటీలు వంద శాతం లక్ష్యాలను సాధించాలని సూచించారు. మార్కెట్ కమిటీల్లోని గోదాములలో రైతుల ధాన్యం నిల్వ చేసుకునేందుకు అవకాశం ఇవ్వాలన్నారు. గోదాముల నుంచి అద్దె బకాయిలను వెంటనే వసూలు చేయాలని ఆదేశించారు. అలాగే పత్తి కొనుగోలు చేస్తున్న కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ)కు కూడా మార్కెట్ ఫీజు కోసం డిమాండ్ నోటీసు ఇవ్వాలని ఆదేశించారు. సమావేశంలో మార్కెటింగ్ శాఖ సంయుక్త సంచాలకులు కె.ఝాన్సీరాణి, శ్రీనివాసులు, గుంటూరు ఏడీఎం బి.రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

నిత్యం నరకం.. నడకే నయం

- మూడు వంతెనల వద్ద రాకపోకలు నిలిపివేత
- సంజీవయ్యనగర్, నెహ్రూనగర్ రైల్వే గేటు, శంకర్‌విలాస్ బ్రిడ్జిపై ట్రాఫిక్ జాం
- గంటలకొద్దీ రద్దీలో చిక్కుకుంటున్న వాహనదారులు
- విద్యార్థులు, ఉద్యోగులకు నిత్యం తప్పని అవస్థలు
- త్వరితగతిన పనులు పూర్తికి నగరవాసుల డిమాండ్

రైల్వే ట్రాక్ ఎక్స్‌టెన్షన్ పనులతో అవస్థలు

అభివృద్ధి పనుల కోసం మూడు వంతెనల వద్ద రాకపోకలు నిలిపివేయడంతో వాహనదారులకు నిత్యం నరకం కనిపిస్తోంది. ట్రాఫిక్ జామ్‌లు చూస్తే నడకే నయం అన్నట్లు పరిస్థితి ఉంది. రోజంతా గంటలకొద్దీ ప్రత్యామ్నాయ మార్గాల్లో ట్రాఫిక్‌లో చిక్కుకుని నగరవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి పనులను వెంటనే పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



రద్దీలో చిక్కుకున్న వాహనచోదకులు



కొనసాగుతున్న పనులు

నెహ్రూనగర్ : రైల్వే ట్రాక్ ఎక్స్‌టెన్షన్ నిమిత్తం గత నెల 25వ తేదీ నుంచి మూడు వంతెనల మీదుగా రాకపోకలు నిలిపివేసిన విషయం తెలిసిందే. దీంతో గుంటూరు నగర వాసులకు ట్రాఫిక్ తిప్పలు తీవ్రం అయ్యాయి. ప్రతి రోజు మూడు వంతెనలు మీదుగా కొన్ని వేల వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. కానీ ఇక్కడ రాకపోకలు నిలిపివేయడంతో నగర ప్రజలు సంజీవయ్యనగర్, నెహ్రూనగర్ రైల్వేగేటు, శంకర్‌విలాస్ బ్రిడ్జి మీదుగా 1 టౌన్ - 2 టౌన్ మధ్య రాకపోకలు సాగిస్తున్నారు. అయితే ఇక్కడే ట్రాఫిక్ మరింత జటిలమైంది. వేలాది వాహనాలు ఈ రహదారుల మీదుగా వస్తుండటంతో ట్రాఫిక్ చక్రబంధంలో నగర ప్రజలు గంటల కొద్దీ ఇరుక్కుపోవాల్సిన పరిస్థితి నెలకొంది.

రైల్వే గేట్ల వద్ద పడిగాపులు

అరండల్‌పేట, బ్రాడీపేట, లక్ష్మీపురం, శ్రీనగర్ నుంచి మూడు వంతెనల మీదుగా రాకపోకలు సాగించే వారు సంజీవయ్యనగర్, నెహ్రూనగర్ రైల్వే గేట్ల మీదుగా కొత్తపేట, ఆర్టీసీ బస్టాండ్, 1 టౌన్‌లోకి ప్రవేశిస్తున్నారు. అయితే ఈ రైల్వే గేట్ల వద్ద ప్రతి 5 నిమిషాలకొకసారి గేటు పడటంతో వాహనదారులు గంటల కొద్దీ నిరీక్షించాల్సిన పరిస్థితి. ఎటు చూసినా వాహనాలు రావడంతో... ద్విచక్ర వాహనాలు వెళ్లడానికి కూడా చిన్న ఖాళీ లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కోసారి ఒకే సారి మూడు రైళ్లు వెళ్లేంత వరకు గేటు తీయకపోవడంతో వాహనదారులు మరింత అవస్థలు పడుతున్నారు. ఇక ఉదయం, సాయంత్రం వేళల్లో పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగాలకు వెళ్లే వారు ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయి నానా ఇబ్బందులు పడుతున్నారు.

త్వరితగతిన పనులు పూర్తి చేయాలి



మూడు వంతెనల వద్ద రాకపోకలు లేకపోవడంతో టూ టౌన్ నుంచి వన్ టౌన్‌కి వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఎటు వెళ్లినా ట్రాఫిక్‌లో ఇరుక్కుపోతున్నాం. ఉన్నతాధికారులు స్పందించి రైల్వే పనులు త్వరితగతిన పూర్తి చేసి ట్రాఫిక్ సమస్య తీర్చాలి.

– జి. సతీష్

గేటు దాటాలంటే గంట పడుతోంది



మూడు వంతెనల మీదుగా రాకపోకలు నిలిపివేయడంతో సంజీవయ్యనగర్ రైల్వే గేటు, నెహ్రూనగర్ రైల్వే గేటు మీదుగా రాకపోకలు సాగిస్తున్నాం. సంజీవయ్యనగర్ రైల్వే గేటు వద్ద గేటు పడితే రెండు, మూడు రైళ్లు వెళ్లే దాకా తీయడం లేదు. ట్రాఫిక్‌లో ఇరుక్కుపోతే అది క్లియర్ అయ్యేలోగా ఇంకో ట్రైన్ రావడంతో మళ్లీ గేటు వేస్తున్నారు. దీంతో గేటు దాటాలంటే నరకప్రాయంగా ఉంటోంది.

– హరికృష్ణ, ప్రవీణ్

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో గురువారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 2,200 గరిష్ఠం : రూ. 3,000

మోడల్ ధర రూ. 2,600

క్లుప్తంగా

విదర్భపై రాజస్థాన్ విజయం



మంగళగిరి: నగర పరిధిలోని అమరావతి టౌన్‌షిప్‌లో కల అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న విజయ్ మర్చంట్ ట్రోఫీలో రాజస్థాన్ జట్టు విజయం సాధించింది. తొలి ఇన్నింగ్స్‌లో విదర్భ జట్టు 205 పరుగులు సాధించగా, రాజస్థాన్ జట్టు 159 పరుగులు చేసింది. రెండవ ఇన్నింగ్స్‌లో విదర్భ జట్టు 141 పరుగులు సాధించగా, రాజస్థాన్ 188 పరుగులు చేసి గెలిచింది. రాజస్థాన్ బ్యాట్స్‌మెన్ ఆదిత్య అగర్వాల్ 65 పరుగులతో రాణించాడు. రాజస్థాన్ జట్టు 5 వికెట్లు తేడాతో విజయం సాధించింది.

విద్యార్థులతో నమోదు చేయించాలి

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రధాని మోదీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పరీక్షా పే చర్చా కార్యక్రమానికి జిల్లాలో అన్ని యాజమాన్యాల్లోని హైస్కూళ్లు, జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులతో నమోదు చేయించాలని జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 6 నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను నమోదు చేయించేందుకు ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపల్స్ తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. దీనిని పర్యవేక్షించేందుకు గుంటూరు జిల్లాకు నోడల్ అధికారిగా డైట్ అధ్యాపకుడు డాక్టర్ కె.ప్రసాద్‌ను నియమించామని తెలిపారు. నమోదుకు ఇన్నోవేటివ్ ఇండియా.మైజీవోవీ.ఇన్ సైట్‌ను సందర్శించాలని, వివరాలకు నోడల్ అధికారిని 80192 07528 నంబర్లో సంప్రదించాలని సూచించారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

వేటపాలెం: దేశాయిపేట పంచాయతీలో ఎక్సైజ్ సిబ్బంది నిర్వహించిన ఆకస్మిక దాడుల్లో అక్రమంగా మద్యం నిల్వ ఉంచిన ఇట్లా శ్రావణి అలియాస్ దుర్గను అదుపులోకి తీసుకున్నట్లు ఎక్సైజ్ ఎస్సై బి.శ్రీహరి గురువారం తెలిపారు. ఆమె వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన 166 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

విద్యుత్ ఆదాతో భావితరాలకు మేలు



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

గుంటూరు వెస్ట్: భావితరాలు మనుగడ సాగించాలంటే ప్రతి ఒక్కరూ ఇప్పటి నుంచే విద్యుత్ ఆదా చేయాల్సిన సామాజిక బాధ్యత ఉందని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక కలెక్టరేట్ ఆవరణలో ర్యాలీని కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు వారోత్సవాల్లో భాగంగా విద్యుత్ ఆదాపై అనేక అవగాహనా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. తక్కువ విద్యుత్ వినియోగంతో పనిచేసే గృహోపకరణాలు ప్రజలు వినియోగించాలని సూచించారు. సౌర విద్యుత్‌ను కూడా విస్తృతంగా ఉపయోగించుకోవాలి. పీఎం సూర్య గృహ పథకం కింద జిల్లాలో ఇంటిపై కప్పుపై సోలార్ ప్యానెల్ ఏర్పాటుకు ఇప్పటి వరకు 5,900 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఇందులో ఇప్పటి వరకు 594 మంది ఇన్‌స్టాలేషన్ చేయించుకున్నట్లు పేర్కొన్నారు. శుక్రవారంతో ఈ కార్యక్రమాలు ముగుస్తాయని తెలిపారు. చిత్రలేఖనం, వ్యాస రచన, వక్తృత్వ పోటీల్లో విజేతలను అభినందించారు. వీరిని ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు 10 వేల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. రైతులకు 48 గంటలలోపే వారి ఖాతాల్లోకి నగదు జమ చేస్తున్నామని తెలిపారు. 17 శాతం వరకు తేమ ఉన్న ధాన్యానికి కూడా ఎంఎస్పీ ధర అందిస్తున్నామని చెప్పారు. ఎంత ధాన్యాన్నైనా కొంటామని కలెక్టర్ వివరించారు. అనంతరం ఎస్‌బీఐ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. అధికారులతో, ప్రజలతో విద్యుత్ ఆదాపై కలెక్టర్, జేసీ ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో డీఆర్వో ఖాజావలి, విద్యుత్ శాఖ ఎస్ఈ ఏవీఎల్ఎస్ మూర్తి, అధికారులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితులు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌హెచ్ఓ వీరసోమయ్య

పట్నంబజారు: యువకుడిపై దాడి చేసి హతమార్చిన కేసులో నిందితులను పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. పాత గుంటూరు పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్ఓ వై.వీరసోమయ్య తెలిపిన వివరాల ప్రకారం... ఈ నెల 17తేదీ రాత్రి తెనాలి చెంచుపేటకు చెందిన చప్పిడి దీపక్ (27)ను కొంత మంది వ్యక్తులు తీవ్రంగా గాయపరిచి గుంటూరు జీజీహెచ్‌లో చేర్పించగా అతడు మృతి చెందాడు. జీజీహెచ్ అధికారుల ఫిర్యాదు మేరకు సమాచారం అందుకున్న పోలీసులు.. మృతుడు దీపక్ అలియాస్ నానిగా గుర్తించారు. గత ఏప్రిల్‌లో తెనాలిలో స్నేహితుడు గద్దల కిరణ్ రూ. 54 వేలను దీపక్‌కు ఇచ్చాడు. అప్పటి నుంచి డబ్బులు అడుగుతుంటే దీపక్ మాట దాటవేస్తూ వస్తున్నాడు. కిరణ్ ఈ నెల 16వ తేదీ రాత్రి దీపక్‌ను తెనాలి నుంచి మాయమాటలు చెప్పి బార్‌లో మద్యం తాగించాడు. గుంటూరులో మందు పార్టీ ఉందని చెప్పి నమ్మబలికాడు. అప్పటికే ఉద్దేశపూర్వకంగా హత్య చేయాలని పక్కా ప్రణాళికతో ఉన్న కిరణ్.. తన స్నేహితులను సిద్ధం చేశాడు. ఆ మేరకు దీపక్‌ను వారితో కలిసి లాలాపేటకు చెందిన బూసా రవిశంకర్, పాతగుంటూరు గాంధీ బొమ్మ సెంటర్‌కు చెందిన షేక్ అక్బర్, పాతగుంటూరు కుమ్మరి బజారుకు చెందిన నల్లమేకల అశోక్, నల్లమేకల గోపి, వినోభానగర్‌కు చెందిన షేక్ ఫెరోజ్, బాలాజీనగర్‌కు చెందిన మాల్యా వెంకట సాయికుమార్‌లు..... బాలాజీనగర్ జీరోలైను రాజీవ్ గృహకల్ప సమీపంలోని ఖాళీ స్థలంలోకి తీసుకెళ్లాడు. పథకం ప్రకారం మరింత మద్యం తాగించి తనకు రావాల్సిన నగదు గురించి దీపక్‌ను కిరణ్ అడిగాడు. ఇప్పుడు లేవని, తరువాత ఇస్తానని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పాడు. ఈ నేపథ్యంలో కిరణ్, దీపక్ మధ్య ఘర్షణ జరిగింది. మరో నిందితుడు రవిశంకర్ మెడలోని గోల్డ్‌చైన్‌ను సైతం దీపక్ లాగడంతో తెగిపోయింది. చైన్ ఒక ముక్క రవిశంకర్ చేతికి, మరో ముక్క దీపక్ వద్ద ఉండటంతో ఇవ్వమని అడగ్గా ఈ విషయంలో వాగ్వాదం జరిగింది. ఆ సమయంలో గద్దల కిరణ్, రవిశంకర్, మిగిలిన వారందరూ కలిసి కర్రలు, బెల్టుతో క్రూరంగా కొట్టి గాయపరిచారు. 16వ తేదీ అర్ధరాత్రి 2 గంటల సమయంలో స్పృహ తప్పి కింద పడిన దీపక్‌ను గుంటూరు జీజీహెచ్‌కు తీసుకెళ్లి చప్పిడి వెంకటరెడ్డి పేరుతో చేర్పించారు. తర్వాత పరారయ్యారు. చికిత్స పొందుతూ 17వ తేదీ ఉదయం దీపక్ మృతి చెందాడు. మృతుడి తండ్రి చంద్రశేఖరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు గురువారం నందివెలుగు రోడ్డులోని వాటర్ ట్యాంకుల వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న నిందితులను అదుపులోకి తీసుకుని విచారించారు. అప్పుడు ఈ హత్యకు పాల్పడినట్లు అంగీకరించారు. నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరుస్తున్నట్లు తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన ఎస్సైలు షేక్ అబ్దుల్ రహమాన్, ఎస్.సి. ప్రసాద్, హెడ్‌కానిస్టేబుళ్లు కె.కోటేశ్వరరావు, ఎం.డి.నూరుద్దీన్, కె.చంద్రశేఖర్, కానిస్టేబుళ్లు జి.శ్రీనివాస్, పి.మురళీలను అభినందించారు.

ఏపీపీఎస్ఎం అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నాగిరెడ్డి



సత్తెనపల్లి: ఏపీ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్ మేనేజ్‌మెంట్(ఏపీపీఎస్ఎం) అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సత్తెనపల్లికి చెందిన భవనం నాగిరెడ్డి, రాష్ట్ర అడ్వైజర్‌గా క్రోసూరుకు చెందిన తిప్పిరెడ్డి జైనేంద్రారెడ్డి ఎంపికయ్యారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్ మేనేజ్మెంట్ అసోసియేషన్ సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల ప్రైవేట్ పాఠశాల డైరెక్టర్లతో గురువారం సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా పల్నాడు జిల్లా అధ్యక్షుడు పీజే ధన్ హాజరై మాట్లాడారు. ఈనెల 29న కేఎల్ యూనివర్సిటీలో రాష్ట్ర సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసినట్టు వివరించారు. ఈ సమావేశం విజయవంతంపై చర్చించారు. సమావేశానికి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ హాజరవుతారని, ప్రైవేటు పాఠశాలల సమస్యలపై చర్చిస్తారని వెల్లడించారు. సత్తెనపల్లి పెదకూరపాడు అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రైవేటు పాఠశాల డైరెక్టర్లు అందరూ హాజరు కావాలని కోరారు. జిల్లా నుంచి రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎంపికైన భవనం నాగిరెడ్డి, రాష్ట్ర అడ్వైజర్‌గా ఎంపికైన తిప్పిరెడ్డి జైనేంద్రారెడ్డిలను పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించి అభినందించారు.

పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శికి కార్మికుల వినతి



యువరాజన్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు తదితరులు

తాడేపల్లిరూరల్: బ్రహ్మానందపురం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు, నాయకులు గురువారం ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు ఆధ్వర్యంలో పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి యువరాజన్‌ను సచివాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ... 2014లో కోర్టు ఆదేశాల ప్రకారం యజమానులు దాదాపు రూ.42.93 కోట్లు కార్మికులకు చెల్లించాల్సి ఉందన్నారు. ఆ మొత్తానికి 12 శాతం వడ్డీని కలిపి రెండు నెలల్లో ఇవ్వాలని కోర్టు ఆదేశించిందని గుర్తుచేశారు. ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీలో 333 మంది కార్మికులు ఉండగా, దాదాపు సగం మంది అనారోగ్యం, అర్ధాకలితో మృతి చెందారని తెలిపారు. ఒకప్పుడు ఎంతో ఘనంగా బతికిన కార్మికులు నేడు ఆర్థిక బాధలతో, కుటుంబ పోషణ కోసం తమకు నైపుణ్యం లేని పనులకు వెళ్తూ కడుపు నింపుకొంటున్నారని యువరాజన్‌కు వివరించారు. తగిన న్యాయం చేస్తానని యువరాజన్ హామీ ఇచ్చారని ఎమ్మెల్సీ తెలిపారు. ఏసీసీ పోరాట కమిటీ కన్వీనర్ కూరపాటి స్టీవెన్ మాట్లాడుతూ.. పీఎఫ్, పెన్షన్ తదితర కార్మికులకు రావాల్సిన న్యాయమైన డిమాండ్లపై హెచ్ఎంటీ తరపున ఎం.బాలాజీ సంతకాలు పెడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్ఎస్పీ యాజమాన్యం ఆయనకు అధికారం ఇచ్చిందని తెలిపారు. యువరాజన్‌ను కలిసిన వారిలో సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.వి.నాగేశ్వరరావు, తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, కె. ఆదినారాయణ, బి.అంకయ్య, వై.సాంబయ్య, ఎం.ఆశీర్వాదం, వై.యహోషువా, బి.సూర్యప్రకాష్ తదితరులు ఉన్నారు. కార్మికులు చేస్తున్న దీక్షలో షంషుద్దీన్, రామారావు, బి.నవనీతం, వి.లక్ష్మి, రమాదేవి, దుర్గాభవాని, రిబిక, సాంబశివరావు, సారమ్మ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన క్రీడా పోటీలు



చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్న విద్యార్థినుల బృందంతో ప్రిన్సిపల్ ఉషారాణి, పీడీలు, అధ్యాపకులు

గుంటూరు ఎడ్యుకేషన్: గుజ్జనగుండ్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ వేదికగా జిల్లాలోని విద్యార్థినులకు రెండు రోజులపాటు జరిగిన జిల్లాస్థాయి 27వ బాలికల స్పోర్ట్స్-గేమ్స్ మీట్ గురువారం ముగిసింది. ఈ సందర్భంగా సత్తా చాటిన గుంటూరులోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ఓవరాల్ చాపియన్‌షిప్ సాధించింది. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జె.ఉషారాణి మాట్లాడుతూ... క్రీడా స్ఫూర్తి, క్రమశిక్షణతో విద్యార్థినులు రాణించారని అన్నారు. తమ కళాశాలకు ఓవరాల్ చాంపియన్‌షిప్‌తో పాటు వ్యక్తిగత విభాగంలోనూ చాంపియన్‌షిప్ దక్కిందని వివరించారు. వ్యక్తిగత విభాగంలో ఈసీఈ విద్యార్థిని కె. నవ్య విజేతగా నిలిచినట్లు తెలిపారు. అదే విధంగా వివిధ విభాగాల వారీగా ఖో-ఖోలో గుంటూరు మహిళా పాలిటెక్నిక్, వాలీబాల్‌లో సెయింట్ మేరీస్, బ్యాడ్మింటన్ సింగిల్స్‌లో సాయి తిరుమల, బ్యాడ్మింటన్ డబుల్స్‌లో సెయింట్ మేరీస్, టేబుల్ టెన్నిస్ సింగిల్స్‌లో హిందూ కళాశాల, టేబుల్ టెన్నిస్ డబుల్స్‌లో గుంటూరు ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు విన్నర్లుగా నిలవడంతోపాటు అథ్లెటిక్స్‌లో బహుమతులు గెలుచుకున్నారని చెప్పారు. దీంతో పాటు పాలిటెక్నిక్ కళాశాలల్లోని సిబ్బందికి నిర్వహించిన టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్ పోటీల్లో పాన్నూరు, గుంటూరు కళాశాలలు విన్నర్స్, రన్నర్లుగా నిలిచారని తెలిపారు. కార్యక్రమంలో ఆయా కళాశాలల ఫిజికల్ డైరెక్టర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఖోఖో జిల్లా జట్టు శిక్షణ పూర్తి



ప్రకాశం జిల్లా బాలుర జట్టు

జె.పంగులూరు: స్థానిక మాగుంట సుబ్బరామిరెడ్డి, బాచిన నారాయణమ్మ జూనియర్ కళాశాలలో గత 20 రోజుల నుంచి ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీ ఆధ్వర్యాన అండర్-19 ఉమ్మడి ప్రకాశం జిల్లా ఖోఖో జట్టు శిక్షణ తీసుకుంటోంది. గురువారం రాష్ట్ర ఖోఖో కార్యదర్శి, కళాశాల పీడీ మేకల సీతారామిరెడ్డి ఆధ్వర్యంలో శిక్షణ ముగింపు జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ మేకల ఉషారెడ్డి మాట్లాడుతూ శిక్షణ తీసుకున్న జట్టు ఈనెల 20, 21, 22 తేదీల్లో తిరుపతి జిల్లా పుత్తూరులో జరిగే అండర్-19 బాలుర స్కూల్ గేమ్స్ పోటీల్లో ఖోఖో పోటీల్లో పాల్గొనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో జట్టు మంచి ప్రతిభ కనబరిచి విజయం సాధించాలని కోరారు. అనంతరం పీడీ సీతారామిరెడ్డి మాట్లాడుతూ గ్రామస్తులు, కళాశాల ప్రిన్సిపాల్ మేకల ఉషారెడ్డి సహకారంలో శిక్షణ జరిగినట్లు తెలిపారు. అండర్-19 ఉమ్మడి ప్రకాశం జిల్లా జట్టు 24 సంవత్సరాల నుంచి ప్రథమ, ద్వితీయ స్థానాలు వస్తున్నట్లు తెలిపారు. వీరికి క్రీడా దుస్తులు ప్రభుత్వం సహకారంతో సమకూర్చినట్లు తెలిపారు. ఈ జట్టు ప్రథమ స్థానం సాధించాలని బాపట్ల ఆర్ఐఓ సైమన్, డీఐఈఓ ఎర్రయ్య కోరారు. కార్యక్రమంలో సీనియర్ క్రీడాకారులు డేవిడ్ రాజు, లోకేష్ చక్రవర్తి పాల్గొన్నారు.

హోరాహోరీగా ఎద్దుల బల ప్రదర్శన పోటీలు



చల్లగుండ్ల శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న కమిటీ నిర్వాహకులు

గురజాల/గురజాల రూరల్ : పట్టణంలోనిపాతపాటేశ్వరి అమ్మవారి తిరునాళ్లను పురస్కరించుకుని రైతు సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఎద్దుల బల ప్రదర్శన పోటీల్లో భాగంగా గురవారం ఆరు పళ్ల జతలు పోటీలు పోటాపోటీగా సాగాయి. ఈ పోటీలను వైద్యుడు చల్లగుండ్ల శ్రీనివాస్ ప్రారంభించారు. గుంటూరు జిల్లా పత్తిపాడు మండలం పాత మల్లాయిపాలెంకు చెందిన సిద్ధంశెట్టి సామ్రాజ్యం ఎద్దుల జత 5201.3 అడుగుల దూరం లాగి ప్రథమస్థానం, కృష్ణా జిల్లా వెదుళ్లపల్లికి చెందిన వల్లభనేని మోహన్‌రావు, గుంటూరు జిల్లా మేడికొండూరు మండలం పాలడుగుకు చెందిన వెదుళ్లపల్లి శ్రీనివాసరావు, శాఖమూరి విజయ పవన్ కుమార్ ఎడ్ల జతలు 5,000 అడుగుల దూరం లాగి రెండో స్థానం, గుంటూరు జిల్లా తూళ్లురుకు చెందన మోదుగుల రామిరెడ్డి, గుంటూరు జిల్లా కోల్లిపరకు చెందిన గుదిబండ మాధవ రెడ్డి ఎడ్ల జత 4,600 అడుగుల దూరం లాగి మూడో స్థానం సాధించాయి. గుంటూరు జిల్లా పత్తిపాడు మండలం పెదగొట్టిపాడుకు చెందిన ఎడ్ల జత 4,324 అడుగుల దూరం లాగి నాలుగో స్థానం, పల్నాడు జిల్లా గురజాలకు చెందిన లింగా ధరణీచౌదరి ఎడ్ల జత 4,256 అడుగులు లాగి ఐదో స్థానం, ప్రకాశం జిల్లా యర్రగొండపాలెంకు చెందిన కె.హుస్సేన్ ఎడ్ల జత 4,077 అడుగుల దూరం లాగి ఆరోస్థానం, పల్నాడు జిల్లా నకరికల్లు మండలం చల్లగుండ్లకు చెందిన మేకా అంజిరెడ్డి ఎడ్ల జత 4,000 అడుగుల దూరం లాగి ఏడో స్థానం కైవసం చేసుకున్నట్టు కమిటీ నిర్వహకులు తెలిపారు. శుక్రవారం నాలుగు పళ్ల జతల పోటీలు నిర్వహిస్తామని వివరించారు.

విద్యుదాఘాతంతో యువకుడి దుర్మరణం



మృతదేహాన్ని పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, నాయకులు



ఇర్ల శంకర్ మృతదేహం

నరసరావుపేటటౌన్/నరసరావుపేట: విద్యుత్‌దాఘాతానికి గురై యువకుడు మృతి చెందిన ఘటన గురువారం పట్టణంలో జరిగింది. టూటౌన్ పోలీసుల కథనం ప్రకారం.. పెద్ద చెరువు ఏడో లైనుకు చెందిన ఇర్ల శంకర్(17) తెల్లవారుజామున టీ తాగేందుకు ఇంటి నుంచి బజారుకు బయలుదేరాడు. మార్గమధ్యంలోని కలెక్టర్ బంగ్లా సమీపంలో రోడ్డుపై తెగి పడి ఉన్న విద్యుత్ తీగను పక్కకు తొలగించేందుకు పట్టుకున్నాడు. ఈ క్రమంలో విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. సమాచారం అందుకున్న టూటౌన్ సీఐ హైమారావు, ఎస్ఐ హరిబాబు, సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరు గురించి స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అర్ధరాత్రి విద్యుత్ తీగ తెగి పడటంతో దాన్ని పట్టుకొని ప్రమాదవశాత్తు మృతి చెందినట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడి తల్లి ధనలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రూ.పది లక్షలు చెల్లించాలి

విద్యుదాఘాతంతో మృతి చెందిన ఇర్ల శంకర్ కుటుంబానికి తక్షణమే రూ.10లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని మాజీ శాసన సభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. ప్రభుత్వ హాస్పిటల్‌లోని మార్చురీలో ఉన్న మృతదేహాన్ని గురువారం నాయకులతో కలిసి ఆయన సందర్శించి ఆ కుటుంబానికి సానుభూతిని తెలియజేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. తక్షణ పరిహారం అందించాలని కోరారు. విద్యుత్ శాఖ ఏఈ ప్రకటించిన రూ.5లక్షల నష్టపరిహారం సరిపోదని పేర్కొన్నారు. గోపిరెడ్డి వెంట గిరిజన కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పాలపర్తి వెంకటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు అచ్చి శివకోటి, వేముల శివ, షేక్ మాబు, తురక నాగుల్ మీరా, కోట చిన్నబాబు, అవార్డు కార్యకర్తలు పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలుడు తల్లిదండ్రుల చెంతకు

సాయంత్రానికే గుర్తించిన పోలీసులు



సీఐ, ఎస్సైని అభినందిస్తున్న డీఎస్పీ మొయిన్. పక్కన తప్పిపోయిన బాలుడు

అద్దంకి రూరల్: ఉదయం తప్పిపోయిన బాలుడిని సాయంత్రానికి అద్దంకి పోలీసులు వెతికి పట్టుకొచ్చిన సంఘటన గురువారం అద్దంకి పట్టణంలో చోటుచేసుకుంది. సీఐ తెలిపిన వివరాల మేరకు .. అద్దంకి పట్టణానికి గొట్టిపాటి శ్రీధర్ కుమారుడు గొట్టిపాటి ఓంకార్ స్థానిక బెల్ అండ్‌బెన్నెట్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్నాడు. ఉదయం పాఠశాలకు సైకిల్‌పై వెళ్లిన ఓంకార్.. స్కూల్‌కు వెళ్లే దారిలో సైకిల్, పుస్తకాల బ్యాగ్ పడవేసి ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయాడు. సమాచారం తెలుసుకున్న తల్లిదండ్రులు తమ కుమారుడు తప్పిపోయాడా లేక కిడ్నాప్‌కు గురయ్యాడా అని భయాందోళనతో సీఐకి సమాచారం ఇవ్వడంతో సీఐ కృష్ణయ్య, ఎస్సై ఖాదర్ బాషాల ఆధ్వర్యంలో నాలుగు బృందాలుగా ఏర్పడి అద్దంకి పరిసర ప్రాంతాల్లో గాలింపు చేపట్టారు. ఆ బాలుడు సాయంత్రం ఒంగోలు బస్టాండ్‌లో కనబడటంతో తీసుకువచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. ఎలా వెళ్లావని బాలుడిని అడగ్గా తాను ఒక్కడినే అద్దంకి బస్టాండ్ నుంచి శ్రీశైలం వెళ్లే బస్సు ఎక్కి ఒంగోలు బస్టాండ్‌లో దిగినట్లు తెలిపాడు. బాలుడిని వెతకటంలో విశేష ప్రతిభకనబర్చిన సీఐ కృష్ణయ్య, ఎస్సై ఖాదర్‌బాషాలను, పోలీస్ బృందాన్ని డీఎస్పీ మొయిన్ అభినందించారు.

పెనుగొండకు అవార్డు ప్రశంసనీయం

నరసరావుపేట: ప్రముఖ అభ్యుదయ రచయిత, కవి, విమర్శకుడు, అరసం జాతీయనేత, న్యాయవాది పెనుగొండ లక్ష్మీనారాయణ కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డుకు ఎంపిక కావడం పల్నాడు జిల్లా సాహితీ లోకానికి గర్వకారణమని అశ్లీలతా ప్రతిఘటనా వేదిక రాష్ట్ర అధ్యక్షులు ఈదర గోపీచంద్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. పెనుగొండ బహుముఖ ప్రజ్ఞాశాలి. అభ్యుదయ సాహిత్య ఉద్యమంలో చురుకైన కార్యకర్తని కొనియాడారు. 1989లో అశ్లీలతా ప్రతిఘటన వేదిక ఏర్పాటు, 1995 ప్రాంతంలో అప్పటి అశ్లీల నవలా రచయితలపై కోర్టులో కేసు వేసి నోటీసులు జారీ చేసి వారిని కాళ్ళబేరానికి రప్పించి అశ్లీల నవలలు రాయబోమని లిఖితపూర్వక హామీలు ఇప్పించుటలోనూ, విరసం రుక్మిణితోపాటు పెనుగొండ కీలక పాత్ర పోషించారని గోపీచంద్ తెలిపారు. అశ్లీల డాన్సులను ప్రతిఘటించటంలోనూ, గ్రంథాలయాల నుంచి ఏడు అశ్లీల నవలలను నిషేధింపజేయడంలోనూ ప్రముఖ పాత్ర పోషించారని ప్రశంసించారు. ఈ ఏడాది ఆరంభంలో తాను వెలువరించిన 'కామోత్సవ దహనం' పుస్తకాన్ని కొత్తపల్లి రవిబాబుతో పాటు పెనుగొండ సహ సంపాదకత్వం వహించారని గోపీచంద్ గుర్తు చేశారు. శ్రీ శ్రీ సాహిత్యం అంటే వీరాభిమాని అయిన పెనుగొండను ప్రధాన ఉపన్యాసకునిగా పిలిపించి నాటి పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి సత్కరించారని పేర్కొన్నారు.

ఎరువుల దుకాణాలలో తనిఖీలు

భట్టిప్రోలు: ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు నాణ్యమైనవి విక్రయించకుంటే దుకాణదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయ శాఖ ఏడీఏ సుదర్శనరాజు (సీడ్స్) హెచ్చరించారు. భట్టిప్రోలులోని పలు ఎరువులు, పురుగుమందులు, విత్తనాల దుకాణాలలో గురువారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఆయా దుకాణాలలో తనిఖీలు నిర్వహించి బిల్ బుక్స్, స్టాక్ రిజిస్టర్లు, ఎరువులు, పురుగు మందు నిల్వలను క్షుణ్ణంగా పరిశీలించారు. కార్యక్రమంలో భట్టిప్రోలు ఏవో జి.మీరయ్యతోపాటు బాపట్ల వ్యవసాయశాఖ కార్యాలయం టెక్నికల్ ఏఓ ఎ.తిరుమలరావు, తూర్పు గోదావరి జిల్లా నల్లచర్ల ఏఓ కమలరాజు పాల్గొన్నారు.

రేపల్లె రూరల్: రైతులకు నాణ్యతతో కూడిన విత్తనాలు, ఎరువులను మాత్రమే విక్రయించాలని వ్యవసాయశాఖ కమిషనరేట్ ఏడీఏ కేవి సుదర్శనరాజు చెప్పారు. పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలను గురువారం వ్యవసాయశాఖల అధికారుల బృందం తనిఖీలు నిర్వహించింది. సుదర్శనరాజు మాట్లాడుతూ రైతులకు అందించే వస్తువులతో పాటు రశీదులను తప్పనిసరిగా అందించాలన్నారు. ఎంఆర్‌పీ కన్నా అధికంగా విక్రయాలు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి దుకాణం ముందు స్టాక్ బోర్డు, ధరల బోర్డులను విధిగా ఏర్పాటు చేయాలన్నారు. దుకాణాలలో రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో రేపల్లె ఏడీఏ ఆర్.విజయ్‌బాబు, బాపట్ల వ్యవసాయ కార్యాలయం డీఏవో ఏ.తిరుమలరావు, నల్లజర్ల ఏవో కమల్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

స్టాక్ నిల్వలు సక్రమంగా ఉండాలి

కర్లపాలెం: ఎరువుల దుకాణాల వద్ద స్టాక్ సక్రమంగా ఉండాలని ఎరువుల తనిఖీ స్క్వాడ్ ఏడీఏ సుదర్శనరాజు పేర్కొన్నారు. కర్లపాలెంలో ఎరువుల దుకాణాలను గురువారం తనిఖీ చేశారు. రైతుల వేలిముద్రలు తీసుకుని ఎరువులు విక్రయాలు చేయాలని సూచించారు.

ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విద్యుత్ ఉద్యోగుల ధర్నా



నరసరావుపేట: విద్యుత్ రంగంలో ప్రైవేటీకరణ విరమించాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక బరంపేటలోని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయం గేటు ముందు ఏపీ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో విద్యుత్ ఉద్యోగులు భోజన విరామ సమయంలో 'ధర్నా' నిర్వహించారు. ఉత్తరప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాల్లో విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణకి వ్యతిరేకంగా ఎన్‌సీసీఓఇఇ పిలుపు మేరకే స్పందించిన విద్యుత్ ఉద్యోగులు ధర్నాలో పాల్గొన్నారు. విద్యుత్ ఉద్యోగుల ఐక్యత వర్ధిల్లాలి, జేఏసీ జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. కార్యాచరణ సమితి సభ్యులు ఆర్ బంగారయ్య, జేఏసీ నాయకులు కె.రవిశంకర్, డెప్యూటీ ఎక్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రసాదరావు కేవీఆర్ఎస్ శ్రీనివాసరావు, అన్నీ వర్గాల విద్యుత్ ఉద్యోగులు, మహిళ ఉద్యోగులూ పాల్గొన్నారు.